క్లుప్తంగా

రిమాండ్ ఖైదీలకు ఉచిత న్యాయ సహాయం

డీఎల్ఎస్ఏ సెక్రటరీ కేవీ కృష్ణయ్య



నూజివీడు: పట్టణంలోని సబ్ జైల్‌ను జిల్లా లీగల్ సర్వీసెస్ అథారిటీ (డీఎల్ఎస్ఏ) సెక్రటరీ కేవీ కృష్ణయ్య మంగళవారం సందర్శించారు. రిమాండ్ ఖైదీలతో ఆయన మాట్లాడారు. లాయర్లను పెట్టుకోలేని వారు ఎవరైనా ఉంటే వారికి ఉచిత న్యాయ సహాయం అందజేస్తామన్నారు. బెయిల్ మంజూరైనా పూచీకత్తు సమర్పించే వారు లేక ఇంకా జైలులోనే ఉంటే వారు తమ బంధువుల ద్వారా పూచీకత్తు సమర్పించాలన్నారు. రిమాండ్ ఖైదీలకు అందిస్తున్న భోజనం మెనూను పరిశీలించారు. రిమాండ్ ఖైదీలను సమస్యలు అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో లీగల్ ఎయిడ్ న్యాయవాది సీహెచ్ తేజచందు, సబ్ జైలు సూపరింటెండెంట్ గంగినేని ప్రసాద్ పాల్గొన్నారు.

విద్యార్థుల రక్తదానం



మైలవరం: మైలవరం లకిరెడ్డి బాలిరెడ్డి ఇంజినీరింగ్ కళాశాల ఎన్ఎస్ఎస్ యూనిట్, ఆంధ్రా హాస్పిటల్ సౌజన్యంతో మంగళవారం కళాశాలలో రక్తదాన శిబిరం నిర్వహించారు. ఆంధ్రా హాస్పిటల్ భవానీపురం బ్రాంచ్ డైరెక్టర్ డాక్టర్ అచ్యుతబాబు మాట్లాడుతూ రక్తదానం చేసిన విద్యార్థులకు త్వరగా రక్తం ఉత్పత్తి కావడానికి తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. ఈ సందర్భంగా 70 మంది విద్యార్థులు రక్తదానం చేశారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె. అప్పారావు, ఎన్ఎస్ఎస్ యూనిట్ ప్రోగ్రామ్ ఆఫీసర్ డాక్టర్ బి. శివ హరిప్రసాద్, అకడమిక్ డీన్ డాక్టర్ ఎం. శ్రీనివాసరావు పాల్గొన్నారు.

ట్రిపుల్ ఐటీ విద్యార్థులకు వక్తృత్వ పోటీలు

నూజివీడు: స్థానిక ట్రిపుల్ ఐటీ విద్యార్థులకు నున్న పవర్‌గ్రిడ్ ఆధ్వర్యంలో మంగళవారం సమగ్రత, సంస్కృతితో దేశ సమృద్ధి అంశంపై వక్తృత్వ పోటీలు నిర్వహించారు. ట్రిపుల్ ఐటీ డైరెక్టర్ ఆచార్య సండ్ర అమరేంద్రకుమార్ మాట్లాడుతూ విద్యార్థుల్లో దేశ సమగ్రత, బాధ్యాయుతమైన పౌరసత్వం, సంస్కృతిని పెంపొందించేందుకు ఇలాంటి కార్యక్రమాలు దోహదపడతాయన్నారు. పవర్ గ్రిడ్ సీనియర్ జనరల్ మేనేజర్ కె. నాగమోహన్‌రావు మాట్లాడుతూ సంపన్నమైన దేశానికి సమగ్రత పునాది అన్నారు. యువతరం చదువుతో పాటు జీవితంలో విలువలను పాటించడం అవసరమని చెప్పారు. విజేతలకు బహుమతులను అందజేశారు. పవర్‌గ్రిడ్ డెప్యూటీ మేనేజర్ శివనాగేశ్వరరావు, ఏఓ బి.లక్ష్మణరావు, డీన్ అకడమిక్స్ రత్నాకర్, అసోసియేట్ డీన్ జ్యోతీలాల్ నాయక్ పాల్గొన్నారు.

పర్యావరణహిత దీపావళిపై కళాజాతా ప్రదర్శన



మైలవరం: ప్రజలు పర్యావరణహిత దీపావళిని జరుపుకోవాలని కళాజాతా బృంద సభ్యులు సూచించారు. ఆంధ్రప్రదేశ్ కాలుష్య నియంత్రణ మండలి విజయవాడ ప్రాంతీయ కార్యాలయం ఆదేశాల మేరకు కళాజాతా బృందం సభ్యులు మైలవరంలో మంగళవారం అవగాహన ప్రదర్శన నిర్వహించారు. భారీ ప్రేలుడు బాణసంచా వాడకూడదని వారు సూచించారు. పర్యావరణహిత దీపావళి అంటే ఎలా జరుపుకోవాలో ప్రదర్శన ద్వారా వివరించారు. దీపావళి అంటే దీపాలంకరణ అని, బాణసంచా విపరీతంగా కాల్చడం వల్ల వాతావరణం కాలుష్యమవుతుందని, దీపావళి పండుగ రోజున తీసుకోవాల్సిన జాగ్రత్తలను ప్రదర్శన ద్వారా చూపించారు. కళాజాతా బృంద సభ్యులు ఎం. ప్రసాదబాబు, ఎం. రత్నరాజు, ఎం లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

బోధనేతర సిబ్బందికి సన్మానం



నూజివీడు: గొల్లపల్లిలోని జెడ్పీ హైస్కూల్‌లో మంగళవారం హెచ్ఎం పొట్లూరి రాధికారాణి నేతృత్వంలో ఇటీవల బదిలీ అయిన బోధనేతర సిబ్బంది సన్మాన కార్యక్రమం నిర్వహించారు. రికార్డ్ అసిస్టెంట్ వి. రవి, ల్యాబ్ అసిస్టెంట్ పి. మరియమ్మ, అటెండర్ బాలమ్మ ఇటీవల పాఠశాల నుంచి వేర్వేరు పాఠశాలలకు బదిలీ అయ్యారు. సన్మానం సందర్భంగా హెచ్ఎం మాట్లాడుతూ పాఠశాల నిర్వహణలో బోధనేతర సిబ్బంది పాత్ర ప్రాముఖ్యమైనదన్నారు. పాఠశాల ఉపాధ్యాయ సిబ్బంది పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో గ్యార్మీ వేడుకలు

విస్సన్నపేట: కొత్తపేటలో మహబు సుభాని దర్గా వద్ద ముస్లింలు భక్తిశ్రద్ధలతో గ్యార్మీ వేడుకలు మంగళవారం నిర్వహించారు. ముస్లింలు ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. అనంతరం అన్నప్రసాద వితరణ జరిగింది. సోమవారం రాత్రి గంధోత్సవంలో భాగంగా ప్రత్యేక ప్రార్థనలు, గ్రామోత్సవం నిర్వహించారు.

పొగచూరుతున్న ప్రజారోగ్యం

- ఎన్టీటీపీఎస్‌తో వాయు కాలుష్యం
- కాలుష్యంలో మగ్గుతున్న పల్లెలు
- వ్యాధుల బారిన ప్రజలు
- ప్రజాందోళనలను పట్టించుకోని అధికారులు



ఇబ్రహీంపట్నం ఎన్టీటీపీఎస్ చిమ్నీల నుంచి వెలువడుతున్న వాయు కాలుష్యం

ఇబ్రహీంపట్నం: ఇబ్రహీంపట్నంలోని ఎన్టీటీపీఎస్‌తో కొండపల్లి, ఇబ్రహీంపట్నం సమీప గ్రామాలు కాలుష్యంలో మగ్గుతున్నాయి. మొదటి యూనిట్ 1979, రెండో యూనిట్ 1980లో ఏర్పాటు చేశారు. 25 ఏళ్లు నిండిన థర్మల్ యూనిట్లు నిలుపుదల చేయాలని గతంలో కేంద్రప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఇటీవలి కాలంలో మరలా మరమ్మతులతో నిర్వహించుకోవచ్చని తెలిపింది. అయితే ఏకధాటిగా రెండు యూనిట్లు 40 ఏళ్లుగా నిర్వహించడం వల్ల వాయు కాలుష్యం వెలువడి ప్రజలు అనారోగ్యానికి గురవుతున్నారు.

వ్యాధుల బారిన ప్రజలు

ఎన్టీటీపీఎస్ యూనిట్ల నుంచి వెలువడే బూడిద నీటి వ్యర్థాల తరలింపునకు కిలేశపురం, జూపూడి, త్రిలోచనాపురం, మూలపాడు, పశ్చిమ ఇబ్రహీంపట్నం సమీపంలో సుమారు 1,650 ఎకరాల్లో బూడిద నీటి వ్యర్థాల చెరువులు ఏర్పాటు చేశారు. కొండపల్లి మున్సిపాల్టీతో పాటు ఆయా గ్రామాల్లో వీచే గాలులకు బూడిద వ్యర్థాలు ఇళ్లల్లోకి చేరుతున్నాయి. బూడిదను నిత్యం లారీలతో రవాణా చేస్తుండటంతో గాలిలో కలిసిన బూడిద పీల్చటం వల్ల ప్రజలు శ్వాసకోశ, చర్మ సంబంధిత వ్యాధుల బారిన పడుతున్నారు. బూడిద ప్రభావం కలిగిన గ్రామాల్లో క్షయ, అలర్జీ, ఆస్మా సంబంధిత వ్యాధులు అధికంగా ఉన్నట్లు స్థానిక పీహెచ్‌సీ వైద్యులు చెబుతున్నారు. బూడిద కాలుష్యం వల్ల భవిష్యత్‌లో పిల్లల పరిస్థితి ఏమిటనే ఆందోళన ప్రజల్లో నెలకొంది.

పంట పొలాలు, పశువులకు ముప్పు

అధికారులు నిబంధనలు పాటించనందున బూడిద కాలుష్యం గ్రామాలను ముంచెత్తుతోంది. బూడిద ప్రభావంతో పంట దిగుబడుల్లో నాణ్యత ఉండటం లేదని, దిగుబడులు తుగ్గుతున్నాయని రైతులు ఆందోళన చెందుతున్నారు. బూడిద చెరువులో మేతకు వెళ్లిన పశువులకు గర్భకోశ వ్యాధులు సోకి పునరుత్పత్తి ఉండటం లేదని రైతులు చెబుతున్నారు. ఎన్టీటీపీఎస్ కాలుష్యం నివారణకు అధికారులు చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

పోరాటానికి కార్యాచరణ

ఎన్టీటీపీఎస్ కాలుష్య నియంత్రణ ప్రజా పోరాట గళం ఫోరం సభ్యులు ఇబ్రహీంపట్నంలో మంగళవారం సమావేశం నిర్వహించారు. బూడిదతో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలపై చర్చించి ప్రజా పోరాటానికి కార్యాచరణ రూపొందించారు. ప్రజలు, విద్యార్థి సంఘాలు, వివిధ పార్టీల భాగస్వామ్యంతో వివిధ రూపాల్లో ఆందోళనలు చేయాలని నిర్ణయించారు. కార్యాచరణ సమితి సభ్యులు ఎం.మహేష్, గొల్లపూడి ప్రసాద్, విఠల్ రావు, ఎంపీటీసీ పొలిశెట్టి తేజ, బసవయ్య, సుగుణ, సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.



నిబంధనలకు విరుద్ధంగా నిర్వహణ

ఎన్టీటీపీఎస్ కాలుష్యం ప్రజలను అనారోగ్యాలకు గురి చేస్తోంది. 25 ఏళ్లకు మూతపడాల్సిన యూనిట్లు 40 ఏళ్లుగా నిబంధనలకు విరుద్ధంగా నిర్వహిస్తున్నారు. కొండపల్లి మున్సిపాల్టీ, వివిధ గ్రామాల్లో వాయు, నీటి కాలుష్యం వెదజల్లుతోంది. కాలంచెల్లిన యూనిట్లలో కాలుష్య నివారణ చర్యలు చేపట్టాలి.

– ఎం.మహేష్, సీఐటీయూ మండల కార్యదర్శి



అధికారుల చర్యలు శూన్యం

ఎన్టీటీపీఎస్ బూడిద, వాయు కాలుష్యంపై అధికారులు ఎటువంటి చర్యలు తీసుకోవడం లేదు. బూడిద నీటి వ్యర్థాలతో బావులు, బోర్లలో నీటి రుచి, రంగు మారిపోతుంది. కాలుష్యంతో పంట పొలాలు, పశువుల ఆరోగ్యం గుల్లవతుంది. కాలుష్యంతో ప్రజల ప్రాణాలు పోతున్నా అధికారులు చర్యలు తీసుకోకపోవడం శోచనీయం.

– గొల్లపూడి ప్రసాద్, ఎంసీపీఐయూ జిల్లా కార్యదర్శి

నేడు నగర పంచాయతీ కౌన్సిల్ సమావేశం

తిరువూరు: తిరువూరు నగర పంచాయతీ కౌన్సిల్ సాధారణ సమావేశం బుధవారం ఉదయం 11 గంటలకు జరుగుతుందని కమిషనర్ బి. లోవరాజు తెలిపారు. చైర్‌పర్సన్ గత్తం కస్తూరిబాయి అధ్యక్షతన జరిగే సమావేశంలో అజెండాలోని అంశాలపై కౌన్సిలర్లు చర్చిస్తారని చెప్పారు.

20 బాణసంచా దుకాణాలకు అనుమతి



నూజివీడు: నూజివీడు పట్టణం, మండల పరిధిలో దీపావళికి తాత్కాలికంగా ఏర్పాటు చేసుకునేందుకు మొత్తం 20 బాణసంచా దుకాణాలకు అధికారులు అనుమతులు ఇచ్చారు. దుకాణాలను పట్టణంలోని విస్సన్నపేట రోడ్డులో ఉన్న లారీ అసోసియేషన్‌కు చెందిన గ్రౌండ్‌లో ఏర్పాటు చేశారు. మీర్జాపురంలో రెండు దుకాణాలు, తుక్కులూరు, అన్నవరంలో ఒక్కొక్క దుకాణానికి అనుమతులు ఇచ్చారు. నిబంధనల ప్రకారం దుకాణాలను ఏర్పాటు చేసేలా రెవెన్యూ, పోలీస్, అగ్నిమాపక అధికారులు చర్యలు తీసుకున్నారు.

నిబంధనలు పాటించకపోతే కఠిన చర్యలు

బాణసంచా దుకాణదారులు నిబంధనలు పాటించకపోతే చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని తహసీల్దార్ బి. సుబ్బారావు హెచ్చరించారు. పట్టణంలో ఏర్పాటు చేసిన బాణసంచా దుకాణాల సముదాయాన్ని ఆయన పరిశీలించి పలు సూచనలు చేశారు.

ప్రజలపై ధరల భారం మోపుతున్న ప్రభుత్వం

సీపీఎం ధ్వజం



సమావేశంలో మాట్లాడుతున్న రాజు

నూజివీడు: కూటమి ప్రభుత్వం ఏర్పడిన తరువాత రాష్ట్రంలో ప్రజలు అనేక సమస్యలను ఎదుర్కొంటున్నారని సీపీఎం ఏలూరు జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు జి. రాజు ధ్వజమెత్తారు. సీపీఎం నూజివీడు మండల కమిటీ సమావేశం కార్యదర్శి పాలేజి సుభాష్ చంద్రబోస్ అధ్యక్షతన పట్టణంలోని సుందరయ్య భవన్‌లో మంగళవారం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఒకవైపు నిత్యావసర వస్తువుల ధరలు, మరోవైపు కూరగాయల ధరలు పెరిగి పేద, మధ్య తరగతి ప్రజలు ఆర్థికంగా అనేక ఇబ్బందులు పడుతున్నారన్నారు. సూపర్ 6 పేరుతో హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిన తరువాత వాటిని అమలు చేయకుండా కూటమి ప్రభుత్వం తాత్సారం చేస్తోందన్నారు. నవంబర్ 8 నుంచి 15వ తేదీ వరకు ప్రజాపోరు కార్యక్రమాన్ని నిర్వహిస్తామని చెప్పారు. మండలంలోని అన్ని గ్రామాల్లో పర్యటించి ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను తెలుసుకుంటామన్నారు. సీఎం చంద్రబాబు విద్యుత్ ఛార్జీలను పెంచి రూ.6,050 కోట్లను ప్రజల నెత్తిపై భారం మోపడానికి సిద్ధమయ్యారన్నారు. ఇది ప్రజలను మోసం చేయడం కాదా అని రాజు ప్రశ్నించారు. విద్యుత్ ఛార్జీల పెంపును ప్రభుత్వం వెంటనే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు కె. శ్రీనివాస్, నూజివీడు మండల కమిటీ సభ్యులు సీహెచ్ శ్రీమన్నారాయణ పాల్గొన్నారు.

మల్లేలలో పొలం పిలుస్తోంది



మాట్లాడుతున్న హెచ్ఓ ఆర్. హేమ

మల్లేల(తిరువూరు): ఖరీఫ్ ధాన్యం కొనుగోలుకు త్వరలో కేంద్రాలు ప్రారంభమవుతాయని, ప్రభుత్వం నిర్ణయించిన మద్దతు ధరకు ఈ కేంద్రాల్లో రైతుల నుంచి నేరుగా ధాన్యం కొనుగోలు చేస్తారని తిరువూరు మండల వ్యవసాయాధికారి పద్మ తెలిపారు. మండలంలోని మల్లేలలో మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధర సాధారణ రకం క్వింటాలుకు రూ.2,300, గ్రేడ్-ఏ రకానికి రూ.2,320 చొప్పున కొనుగోలు చేస్తారని, ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. మల్లేలలో కోతకు వచ్చిన వరిపైర్లను పరిశీలించారు.

- నూజివీడు: యనమదల, మర్రిబంధంలో ఉద్యాన శాఖ ఆధ్వర్యంలో మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఉద్యాన అధికారి ఆర్. హేమ మాట్లాడుతూ ఆయిల్‌పామ్ తోటల్లో ఘన జీవామృతం తయారీ విధానంపై రైతులకు అవగాహన కల్పించారు. వ్యవసాయ, ఉద్యాన పంటల సాగులో తక్కువ పెట్టుబడితో అధిక దిగుబడి, లాభాలు సాధించడంపై రైతులకు సూచనలు చేశారు. మామిడి తోటల్లో చేపట్టాల్సిన సస్యరక్షణ పద్ధతులపై రైతులకు అవగాహన కల్పించారు. సెరీకల్చర్ సిబ్బంది ఎం. హరిబాబు, రైతు సేవా కేంద్రాల సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

వెల్లటూరులో లెదర్ పార్కు పనులు ప్రారంభించాలి

రాష్ట్ర చర్మకార అభివృద్ధి సంస్థ అధ్యక్షుడు రాజారావు డిమాండ్



లెదర్ పార్కుకు కేటాయించిన స్థలాన్ని పరిశీలిస్తున్న చర్మకార అభివృద్ధి సంస్థ సభ్యులు

జి.కొండూరు(మైలవరం): వెల్లటూరులో లెదర్ పార్కు ఏర్పాటు పనులను వెంటనే ప్రారంభించాలని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర చర్మకార అభివృద్ధి సంస్థ అధ్యక్షుడు బల్లా రాజారావు డిమాండ్ చేశారు. జి.కొండూరు మండలంలోని వెల్లటూరు గ్రామంలో మినీ లెదర్ పార్కు నిర్మాణానికి గతంలో కేటాయించిన స్థలాన్ని మంగళవారం గ్రామస్తులతో కలిసి ఆయన సందర్శించారు. రాజారావు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం పీఎం అజయ్ పథకం కింద వెల్లటూరులో లెదర్ పార్కు కోసం రూ.5.30 కోట్ల నిధులను గత మార్చిలో మంజూరు చేసిందని చెప్పారు. పనులు ప్రారంభం కాకపోవడంతో స్థానిక లెదర్ పార్కుకు కేటాయించిన స్థలంలో పిచ్చి మొక్కలు పెరిగి చిట్టడవిని తలపిస్తోందన్నారు. రాష్ట్రంలో పేదల కోసం కేటాయించిన భూములు అన్యాక్రాంతం అవుతున్నాయన్నారు. ఉమ్మడి జిల్లా కార్యదర్శి బట్టపర్తి రాజు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం యుద్ధప్రాతిపదికన రాష్ట్ర వ్యాప్తంగా గుర్తించిన లెదర్ పార్కుల నిర్మాణాన్ని చేపడితే వేలాది మంది చర్మకారుల కుటుంబాలకు జీవనోపాధి లభిస్తుందని చెప్పారు. లెదర్ పార్కుల్లో మాదిగ యువతకు శిక్షణ ఇచ్చి నిరుద్యోగ సమస్యను పరిష్కరించాలని కోరారు. చర్మకార సంఘం నాయకులు బుల్ల రాజు, కొండూరు లక్ష్మణ్, కోపూరు ఏడుకొండలు, పి. రాజశేఖర్, ఎన్. ఏసోబు, జి. వెంకటేశ్వరరావు, కె.నాగరాజు, పి. విజయ్, మంద రాజేష్, జోజి పాల్గొన్నారు.

స్థలం కబ్జాదారుడిపై చర్యలు చేపట్టాలని వినతి

ఇబ్రహీంపట్నం: న్యూ లైఫ్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆఫ్ ద బ్లైండ్ సంస్థకు గతంలో కేటాయించిన స్థలాన్ని సంస్థ అధ్యక్షుడు జీఎస్ఆర్ స్వామి కబ్జా చేశాడని ఆ సంఘం సభ్యులు ఆరోపించారు. ఈ మేరకు తహసీల్దార్ వెంకటేశ్వర్లు, కొండపల్లి మున్సిపల్ కమిషనర్ శ్రీనివాసరావుకు మంగళవారం వినతిపత్రం అందజేశారు. దివ్యాంగుల సంక్షేమాన్ని దృష్టిలో పెట్టుకుని సర్వే నంబర్ 230/1లో 14 సెంట్ల స్థలం కేటాయించినట్లు సభ్యులు తెలిపారు. దివ్యాంగులను మోసం చేసిన అధ్యక్షుడు స్థలంలో కట్టడాలు ప్రారంభించాడని చెప్పారు. స్థలంలో కట్టడాలు నిలిపివేసి సంఘ కార్యకలాపాల పుస్తకాలు స్వాధీనం చేసుకోవాలని కోరారు.

పుట్టగొడుగుల పరిశ్రమపై అవగాహన

మైలవరం: పుట్టగొడుగుల పరిశ్రమను గ్రామాలలో తమ ఇళ్ల వద్దే ఏర్పాటు చేసుకోవచ్చని మైలవరం డాక్టర్ లకిరెడ్డి హనిమిరెడ్డి ప్రభుత్వ డిగ్రీ కళాశాల వృక్షశాస్త్ర అధ్యాపకులు జె. రాముడు అన్నారు. కళాశాలలో మంగళవారం ఆయన మాట్లాడుతూ తమ కళాశాల బీఎస్సీ బోటనీ, హార్టికల్చర్ విద్యార్థులను విజయవాడలోని తనుశ్రీ మష్రూమ్స్ ఉత్పత్తి కేంద్రానికి క్షేత్ర సందర్శనకు తీసుకువెళ్లి మష్రూమ్స్ పెంపకంపై అవగాహన కల్పించామన్నారు. మష్రూమ్స్ ఉత్పత్తి లాభదాయకమైన పంట అని, ఇంటి వద్దనే కేంద్రం ఏర్పాటు చేసుకోవచ్చని వివరించారు. హార్టికల్చర్ అధ్యాపకులు డాక్టర్ పుల్లారావు, గౌతమి, విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రమాదకరంగా గండి



అక్కపాలెం(తిరువూరు): తిరువూరు నుంచి అక్కపాలెం వెళ్లే ఆర్ అండ్ బీ రహదారిలో మల్లమ్మ చెరువు సమీపంలో గత నెలలో కురిసిన భారీ వర్షాలకు పడిన గండితో వాహనాల రాకపోకలు నిలిచిపోయాయి. కనీసం ద్విచక్ర వాహనాలు కూడా వెళ్లేందుకు వీలులేకుండా రోడ్డుకు అడ్డంగా పడిన నిలువెత్తు గండి కారణంగా అక్కపాలెం, రఘునాథ బంజరు, చంద్రుపట్ల వెళ్లేవారు ఐదు కిలోమీటర్లు చుట్టూ తిరిగి వెళ్లక తప్పని పరిస్థితి. అధికారులు స్పందించి గండి పూడ్చివేతకు చర్యలు చేపట్టాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

కుర్చీలు అందజేత

మైలవరం: మైలవరంలోని లయన్స్ సామాజిక భవనానికి ముత్యాల కిరణ్, ముత్యాల రత్తయ్య, పసుపులేటి ఫణికుమార్ రూ.32 వేల విలువ చేసే కుర్చీలను మంగళవారం అందజేశారు. దాతలను ద్వారకా తిరుమల దేవస్థానాల చైర్మన్ ఎస్వీ సుధాకరరావు అభినందించారు.

రోగులకు మెరుగైన వైద్య సేవలు

ఎమ్మెల్యే శ్రీనివాసరావు



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే శ్రీనివాసరావు

తిరువూరు: ప్రభుత్వాస్పత్రికి వచ్చే రోగులకు సత్వరమే మెరుగైన వైద్య సేవలు అందించాలని తిరువూరు ఎమ్మెల్యే కె. శ్రీనివాసరావు వైద్యులకు సూచించారు. స్థానిక కమ్యూనిటీ ఆస్పత్రిలో మంగళవారం అభివృద్ధి కమిటీ సమావేశం ఎమ్మెల్యే అధ్యక్షతన జరిగింది. ఎమ్మెల్యే మాట్లాడుతూ తిరువూరు ప్రాంతంలో ఎక్కువగా రోడ్డు ప్రమాదాలు జరుగుతూ చికిత్స నిమిత్తం క్షతగాత్రులు ఆస్పత్రికి వస్తున్నందున ఆర్థోపెడిక్ సర్జన్‌ను నియమించాలని ప్రభుత్వానికి సిఫారసు చేస్తానన్నారు. ఆపరేషన్ థియేటర్‌లో, ఇతర విభాగాల్లో ఆధునిక వైద్య పరికరాల ఏర్పాటుకు కూడా నిధులు మంజూరు చేయిస్తానని చెప్పారు. ఆస్పత్రిలో నెలకొన్న సమస్యలను వైద్యాధికారి గార్గేయ వివరించారు. వైస్ చైర్మన్ సూరపనేని జయసింహ, సభ్యులు ఆకుల దుర్గాప్రసాద్, మామిడి వెంకటమ్మ, నగర పంచాయతీ కమిషనర్ లోవరాజు పాల్గొన్నారు.

సీసీ రహదారికి శంకుస్థాపన..

తిరువూరు 13వ వార్డు భగత్‌సింగ్ నగర్ కాలనీ ఎస్సీ, ఎస్టీ నిధులతో సీసీ రహదారి నిర్మాణ పనులకు ఎమ్మెల్యే శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమం నిమిత్తం వేసిన శిలాఫలకంలో ప్రొటోకాల్‌ను ఉల్లంఘించారని, రాజ్యసభ సభ్యుడు అయోధ్య రామిరెడ్డి పేరు ఎందుకు వేయలేదని వైఎస్సార్ సీపీ కౌన్సిలర్లు పరసా శ్రీనివాసరావు, ఇనపనూరి చిన్నారి తదితరులు అభ్యంతరం వ్యక్తంచేశారు.

క్రీడా పోటీల్లో జెడ్పీ విద్యార్థుల ప్రతిభ



క్రీడాకారులు మేఘన, పవన్ శ్రీనివాస్‌ను అభినందిస్తున్న హెచ్ఎం డేవిడ్ రాక్‌ఫెల్లర్

మూలపాడు(ఇబ్రహీంపట్నం): రాష్ట్ర స్థాయి హ్యాండ్ బాల్ టోర్నమెంట్‌లో మూలపాడు జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థిని ఉర్ల మేఘన ప్రతిభ కనబరించిందని పాఠశాల హెచ్ఎం డేవిడ్ రాక్‌ఫెల్లర్ మంగళవారం తెలిపారు. తెనాలిలో జరిగిన రాష్ట్ర స్థాయి (ఇంటర్ డిస్ట్రిక్ట్) అండర్-14 విభాగం హ్యాండ్ బాల్ పోటీల్లో ఆమె పాల్గొన్న జట్టు ద్వితీయ స్థానంలో నిలిచిందని చెప్పారు. ఇటీవలి కాలంలో జగ్గయ్యపేటలో జరిగిన జిల్లా స్థాయి అథ్లెటిక్స్ 100 మీటర్ల హర్డిల్స్‌లో అమ్మిదేవరపు పవన్ శ్రీనివాస్ ప్రథమ స్థానంలో నిలిచి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యారని చెప్పారు. క్రీడాకారులను, పీఈటీలు సురేంద్రబాబు, శ్రీనివాసరావు, వహీదాబేగంను ఆయన అభినందించారు.

ఖోఖో, యోగా పోటీలకు విద్యార్థులు..



రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థినులతో హెచ్ఎం, ఉపాధ్యాయులు

చిలుకూరువారిగూడెం(మైలవరం): రాష్ట్ర స్థాయిలో జరిగే ఖోఖో, యోగా పోటీలకు మైలవరం మండలం చిలుకూరువారిగూడెం జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులు ఎంపికయ్యారని పాఠశాల హెచ్ఎం వి. నారాయణరావు తెలిపారు. పాఠశాలలో మంగళవారం ఆయన మాట్లాడుతూ ఈ నెల 24న గుడివాడలో నిర్వహించిన రాష్ట్ర స్థాయి ఖోఖో సెలక్షన్స్‌లో తమ విద్యార్థిని అండర్-14 విభాగంలో టి. సంజన, విజయవాడలో నిర్వహించిన రాష్ట్ర స్థాయి యోగా సెలక్షన్స్ అండర్-14 విభాగంలో వి. పల్లవి ఎంపికయ్యారని చెప్పారు. విద్యార్థినులను హెచ్ఎం, ఉపాధ్యాయ సిబ్బంది అభినందించారు.

పాడి రైతు కుటుంబానికి చేయూత

నూజివీడు: పోతురెడ్డిపల్లిలో ఇటీవల చెరువులో పడి మృతి చెందిన దంపతుల కుటుంబానికి కృష్ణా మిల్క్ యూనియన్ ఆర్థిక సాయాన్ని అందజేసింది. క్షీరబంధు పథకం కింద రూ.50 వేలు, బీమా సొమ్ము రూ.2 లక్షలు కలిపి రూ.2.50 లక్షలకు సంబంధించిన చెక్కులను మృతుని కుటుంబ సభ్యులకు మంత్రి కొలుసు పార్థసారథి, కృష్ణా మిల్క్ యూనియన్ చైర్మన్ చలసాని ఆంజనేయులు చేతుల మీదుగా అందజేశారు. కార్యక్రమంలో పాలకవర్గ సభ్యులు బొట్టు రామచంద్రరావు, పోతురెడ్డిపల్లి పాలకేంద్రం అధ్యక్షుడు పర్వతనేని చంద్రశేఖర్, హనుమాన్ జంక్షన్ రూట్ మేనేజర్ మాగంటి హరిబాబు పాల్గొన్నారు.

అగ్ని బాధితులకు సహాయం

ముసునూరు: ఇటీవల అగ్ని ప్రమాదానికి గురైన కోడె శ్రీనివాసరావు కుటుంబానికి అట్లూరి ట్రస్ట్ చైర్మన్ వెంకట రవీంద్ర ఆపన్నహస్తం అందించారు. మంగళవారం ఆయన గోపవరంలో ఘటన స్థలానికి వచ్చి వారిని ఓదార్చి రూ.5వేల విలువైన నూతన వస్త్రాలు, వంట సామగ్రి, 25 కిలోల బియ్యం, ఆర్థిక సహాయం అందజేశారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ ధర్మరాజు, మాజీ ఎంపీటీసీ శ్రీనివాసరావు, స్థానికులు పాల్గొన్నారు.

అక్రమంగా నిల్వ చేసిన బాణసంచా స్వాధీనం

కొండపల్లి(ఇబ్రహీంపట్నం): కొండపల్లిలో జనావాసాల మధ్య అక్రమంగా నిల్వ చేసిన బాణసంచాను టాస్క్‌ఫోర్స్ అధికారులు ఆదివారం రాత్రి సీజ్ చేశారు. సుమారు రూ.2.50 లక్షల విలువైన సామగ్రిని పోలీస్ స్టేషన్‌కు అప్పగించిన ఘటన మంగళవారం ఆలస్యంగా వెలుగుచూసింది. టాస్క్‌ఫోర్స్ అధికారుల ఫిర్యాదు మేరకు ఆ రోజే కేసు నమోదు చేసిన పోలీసులు పట్టుబడిన బాణసంచా విషయం బయటకు పొక్కకుండా, మీడియాకు చేరకుండా జాగ్రత్త పడ్డారని ప్రచారం జరుగుతోంది. ఈ ఘటనలో పెద్ద మొత్తంలో చేతులు మారాయని స్థానికులు చర్చించుకుంటున్నారు. ఇదిలా ఉండగా ఇబ్రహీంపట్నం, గుంటుపల్లి, కొండపల్లి, ఎన్టీటీపీఎస్ స్టోర్ పరిధిలో మొత్తం 15 బాణసంచా దుకాణాలకు అనుమతి ఇచ్చినట్లు తహసీల్దార్ వై.వెంకటేశ్వర్లు తెలిపారు.

బెల్టు షాపు నిర్వాహకుడి అరెస్ట్

వామకుంట్ల(తిరువూరు): మండలంలోని వామకుంట్లలో అనధికారికంగా మద్యం విక్రయిస్తున్న వ్యక్తిని తిరువూరు పోలీసులు మంగళవారం అరెస్టు చేశారు. సెక్టార్-1 ఎస్ఐ సత్యనారాయణ తెలిపిన వివరాల ప్రకారం.. వామకుంట్లకు చెందిన బండి నాగేశ్వరరావు గ్రామంలో మద్యం అమ్మకాలు జరుపుతున్నట్లు సమాచారం అందుకుని దాడి చేశారు. అతని నుంచి 16 మద్యం సీసాలు స్వాధీనం చేసుకుని నిందితుడిని అరెస్టు చేశారు.

లారీ డ్రైవర్ నిర్లక్ష్యంతో వ్యక్తి మృతి

ఆగిరిపల్లి: లారీ డ్రైవర్ నిర్లక్ష్యంతో ఓ వ్యక్తి మృతిచెందాడు. ఎస్ఐ శుభశేఖర్ తెలిపిన వివరాల ప్రకారం.. ఎస్ఏ పేటలో మూడు నెలల కిందట జామాయిల్ తోటలో కర్రలను లారీలో లోడ్ చేయడానికి బీహార్ నుంచి కురుష సహాని (25) వచ్చాడు. సోమవారం కర్రలను లోడ్ చేసిన అనంతరం కొంతసేపు విశ్రాంతి తీసుకుందామని లారీ కింద పడుకుని నిద్రపోయాడు. లారీ డ్రైవర్ షేక్ అల్తాఫ్ గమనించకుండా లారీని నడపడంతో లారీ కింద నిద్రిస్తున్న సహానికి తీవ్ర గాయాలయ్యాయి. బాధితుడిని మెరుగైన వైద్యం కోసం విజయవాడ ప్రభుత్వాస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మంగళవారం ఉదయం మృతి చెందాడు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వాగులో ట్రాక్టర్ బోల్తా

డ్రైవర్‌కు గాయాలు



ముసునూరు: ఉచిత ఇసుక పథకంలో అధిక ట్రిప్పులు తోలాలనే ఆత్రుత ట్రాక్టర్ డ్రైవర్‌ను గాయాల పాల్జేసింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని బలివే తమ్మిలేరు రీచ్ నుంచి ఓ డ్రైవర్ తన ట్రాక్టర్‌తో ఇసుకలోడుతో వెళ్లి నూజివీడు మండలం మీర్జాపురం ప్రాంతంలో మంగళవారం అన్‌లోడు చేసి తమ్మిలేరుకు త్వరగా చేరుకుని మరొక లోడు ఇసుక తీసుకెళ్లాలనే ఉద్దేశంతో ట్రాక్టర్‌ను వేగంగా నడిపాడు. ట్రాక్టర్ కాట్రేనిపాడు నూతన సచివాలయం దాటిన తరువాత పెద్ద చెరువు వద్ద ప్రమాదవశాత్తు ఇంజిన్ ట్రక్కు నుంచి విడిపోయి వాగులో పడింది. ట్రక్కు రోడ్డుపై నిలిచిపోయింది. గాయపడిన ట్రాక్టర్ డ్రైవర్‌ను స్థానికులు ఆస్పత్రికి తరలించారు.